క్లుప్తంగా

పీవీకి భారతరత్న ప్రకటనపై ఎమ్మెల్యే హర్షం



సుభాష్‌నగర్: మాజీ ప్రధాని, బహుభాషా వేత్త పీవీ నర్సింహారావుకు భారత రత్న ప్రకటించడంపై నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శుక్రవారం హర్షం వ్యక్తంచేశారు. రాజకీయంగా అంచెలంచెలుగా ఎదిగి మంత్రిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా, దేశ ప్రధానిగా సేవలందించారని పేర్కొన్నారు. తెలంగాణ వ్యక్తి దేశ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించారని, తెలుగోడి గొప్పతనాన్ని వెలుగెత్తి చాటిన వ్యక్తి అని కొనియాడారు. రాజకీయంగానే కాకుండా కళలు, సాహిత్యంలో కూడా మంచి పట్టున్న వ్యక్తి అని, వేయి పడగలు నవలను హిందీ అనువదించినందుకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందారని గుర్తుచేశారు.

జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలకు ఎంపిక



సిరికొండ: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరు నుంచి 10వ తరగతి విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. స్థానిక ప్రతిభ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని శ్రీనిధి ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబర్చి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థినిని కరస్పాండెంట్ హరీష్, పీజీ హెచ్ఎం సతీష్‌గౌడ్ ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

సమ్మెలోకి మధ్యాహ్న భోజన కార్మికులు



ధర్పల్లి: ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొంటారని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపునూరు చక్రపాణి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశాన్ని నిర్వహించి సమ్మె నోటీసును విద్యా వనరుల కేంద్రంలో అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను తీర్చడం లేదని పేర్కొన్నారు. సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సిరికొండలో..

సిరికొండ: దేశవ్యాప్త సమ్మెలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు పాల్గొంటారని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి తెలిపారు. మండల విద్యా వనరుల కేంద్రంలో సిబ్బందికి కార్మికులతో కలిసి ఆయన సమ్మె నోటీసును శుక్రవారం అందజేశారు. బుచ్చవ్వ, పద్మ, ధర్మవ్వ, నవ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రక్తదానం

నిజామాబాద్‌అర్బన్: పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ యాదిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సంఘం ఇలాంటి సేవ కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ రక్తదాన శిబిరంలో 80 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్, నాయకులు పెంట జలేందర్, పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

బాల్కొండ: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని డిమాండ్ చేస్తూ ముప్కాల్ మండల కేంద్రంలో జీపీ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, క్యాన్సర్‌ను తరిమి కొట్టాలన్నారు. జూట్ బ్యాగులను వినియోగించాలన్నారు. ఎంపీడీవో దామోదర్, ఆర్ఐ గంగాధర్ పాల్గొన్నారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

బాల్కొండ: బాల కార్మికులను ఇటుక బట్టీల వద్ద పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని బాల్కొండ ఎస్సై గోపి హెచ్చరించారు. శుక్రవారం ఇత్వార్‌పేట్, బస్సాపూర్, జలాల్‌పూర్ శివారుల్లోని ఇటుక బట్టీల వద్ద గల పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు.

సామగ్రి చోరీ

నందిపేట్ (ఆర్మూర్): కుద్వాన్‌పూర్‌లో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. వివరాలు.. కుద్వాన్‌పూర్ గ్రామంలోని టెంట్ హౌస్, మహిళా సంఘం భవనం, ఆర్డర్ మెస్ షట్టర్ తాళాలు పగలగొట్టి లోనికి చొరబడి వస్తు సామగ్రిని ఎత్తుకెళ్లారు. వస్తువుల్ని చిందరవందరగా పడేశారు.

నయనానందకరంగా పార్కు

- ఆరోగ్య సూత్రంతో తీర్చిదిద్దిన వైనం
- వాకర్లను ఆకట్టుకుంటున్న ఏర్పాట్లు



చంద్రశేఖర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన నగర వాటిక పార్కు

నిజామాబాద్ సిటీ: నగరంలో చంద్రశేఖర్‌కాలనీ చౌరస్తా(బైపాస్‌రోడ్డు)లో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్య సూత్రంతో ఏర్పాటు చేసిన నగర వాటిక పార్కు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇలాంటి ఆరోగ్య సూత్రంతో తీర్చిదిద్దిన పార్కు ఎక్కడా లేకపోవటంతో పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇక్కడకు వాకింగ్‌కు వస్తున్నారు. ఇదే స్థలం గతంలో చెత్తాచెదారంతో నిండి ఉండగా మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల పుణ్యమా అంటూ ఈ స్థలంలో నగర వాటిక పార్కు ఏర్పాటు చేయటంతో ఈ ప్రాంతం రూపురేఖలే మారిపోయాయి.



కంకర రోడ్డు

కంకరతో రోడ్ల ఏర్పాటు..

నగరంలోని మున్సిపల్ పార్కులలో నడకదారులు సీసీరోడ్లు లేదా, బండరాళ్లతో ఉండగా, నగర వాటిక పార్కులో మట్టితో కూడిన నడక దారిను ఏర్పాటు చేశారు. దాంతో పార్కు వాకర్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. అలాగే పార్కు లోపల పంచ తత్వం వనంలో గౌతమ బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేశారు. దాంతోపాటుగా వాకర్లకు రక్తప్రసరణ మరింత మెరుగుపడేందుకు కంకర రాళ్లు, చిన్న కంకర, సన్నం ఇసుక, దొడ్డు ఇసుక, నీటికుంట ఏర్పాటు చేయటంతో దూర ప్రాంతాల నుంచి సైతం ప్రజలు ఇక్కడ వాకింగ్ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.



పార్కులో గౌతం బుద్ధుడి విగ్రహం

ఆహ్లాదం అందిస్తున్న పార్కు..

పార్కులో ప్రజలు సేద తీరేందుకు చక్కటి గ్రీనరీ, బెంచ్‌లను ఏర్పాటు చేశారు. మరోపక్క పార్కులో వివిధ రకాల ఔషధ మొక్కలను నాటారు. ఇందులో ప్రజలు సేద తీరేందుకు బెంచ్‌లను ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకునేందుకు చక్కటి గ్రీనరీ ఏర్పాటు చేయటంతో పిల్లలు ఆనందంగా గడుపుతున్నారు.

మరిన్ని ఏర్పాట్లు చేయాలి



నగర వాటిక తరహాలో నగరంలో మరిన్ని పార్కులు ఏర్పాటు చేయాలి. ఇక్కడ పార్కును మున్సిపల్ అధికారులు ఆరోగ్యపరంగా మంచిగా తీర్చిదిద్దారు. పార్కులో గులకరాళ్లు, ఇసుక, నీటి కుంటను ఏర్పాటు చేశారు. వీటిపై నడిస్తే రక్తప్రసరణ జరిగి ఆరోగ్యం బాగుంటుంది. గతంలో పార్కుకు 10 మంది వరకే వచ్చేవారు. ఇప్పుడు వాకర్లు బాగా పెరిగారు. – సత్యం, కేసీఆర్‌కాలనీ

ఆహ్లాదకరంగా ఉంది



చంద్రశేఖర్ కాలనీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన పార్కు ఈ ప్రాంతానికి అందం తెచ్చింది. గత డిసెంబర్‌లో మొదలుపెట్టారు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ఇక్కడకు వాకింగ్‌కు వస్తున్నాను. పార్కులో వాకింగ్ చేయటం వల్ల ఆరోగ్య సమస్యలు దూరం అవుతున్నాయి. పిల్లలు ఆడుకునేందుకు, వృద్ధులు సేదతీరేలా పార్కును తీర్చిదిద్దారు. – సారిక, కేసీఆర్‌కాలనీ

మట్టిపై నడకతో ప్రయోజనం



పార్కులో వాకింగ్ ట్రాక్‌ను పూర్తిగా మట్టితో ఏర్పాటు చేశారు. ఇలాంటి పార్కు నగరంలో ఎక్కడా లేదు. కాళ్లకు చెప్పులు, బూట్లు ధరించకుండా మట్టి ట్రాక్‌పై వాకింగ్ చేస్తుంటే ఆరోగ్యం బాగుంది. పార్కులో ఔషధ మొక్కలు నాటడం వల్ల మంచి ఆక్సిజన్ లభిస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వస్తున్నాను. – ప్రశాంత్, చంద్రశేఖర్‌కాలనీ

వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు అపూర్వ స్పందన

- సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మ నాయక్



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

నిజామాబాద్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని ఐఅండ్‌బి, సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కాలూరు, ఖానాపూర్‌లో వికసిత్ భారత్ యాత్ర ఫేజ్–2 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మనాయక్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలు తెలియని వారికి, వాటిని వినియోగించుకోకుండా ఇంకా మిగిలిపోయిన వారికి పథకాలు అందించడానికి పెద్ద ఎత్తున వికసిత్ భారత సంకల్ప యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. వికసిత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నామని, వాటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్‌డీఎం నాగ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ కేంద్ర పథకాల గురించి అవగాహన పెంపొందించు కుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ సంకల్ప యా త్ర నిర్వహిస్తోందని అన్నారు. కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, క్యాలెండర్లను ఆవిష్కరించి, ప్రజలకు పంపి ణీ చేశారు. ఎస్‌బీఐ మేనేజర్ మాలిక్, వైద్యులు, వ్య వసాయ, మెప్మా, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య వారోత్సవాలు



నిజామాబాద్‌రూరల్: పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని 19 గ్రామాల్లో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టారు. ప్రధాన కూడళ్ల వద్ద ఉన్న చెత్తను శుభ్రం చేశారు. అదేవిధంగా డంపింగ్‌యార్డు, పల్లె ప్రకృతివనం, వైకుంఠధామం, డ్రైనేజీలను పంచాయతీ కార్మికులు శుభ్రం చేశారు. ఎంపీడీవో పర్యవేక్షించారు. పంచాయతీ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అన్నపూర్ణేశ్వరి దేవి జాతర



రథాన్ని లాగుతున్న భక్తులు

సిరికొండ: పెద్దవాల్గోట్ శివారులోని త్రీహిల్స్ అన్నపూర్ణేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం జాతర వైభవంగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు యజ్ఞం నిర్వహించారు. అమ్మవారి రథోత్సవం కన్నుల పండగగా సాగింది. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మండలంతో పాటు ధర్పల్లి, భీమ్‌గల్ మండలాల భక్తులు పాల్గొన్నారు.



పుష్కరిణిలో స్నానాలు చేస్తున్న భక్తులు

లొంకలో పుణ్య స్నానాలు

సిరికొండ: ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ప్రముఖ శైవ క్షేత్రం లొంకలో మాఘ శుద్ధ బహుళ అమావాస్యను పురస్కరించుకొని పుష్కరిణిలో భక్తులు శుక్రవారం పుణ్య స్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సైకత లింగానికి అభిషేకాలు, అన్న పూజలు చేశారు.

వర్సిటీ అధికారులు తీరు మార్చుకోవాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ హాస్టళ్లలో విద్యార్థినులు అస్వస్థతకు గురైతే సరైన వైద్య చికిత్స అందకపోవడం వర్సిటీ ఉన్నతాధికారుల అసమర్థతకు నిదర్శమని వర్సిటీ ఎస్ఎస్‌యూఐ అధ్యక్షుడు కొమిరె శ్రీశైలం ఆరోపించారు. శుక్రవారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ వద్ద శ్రీశైలం మాట్లాడుతూ.. విద్యార్థినులు అస్వస్థతకు గురికావడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా వర్సిటీ ఉన్నతాధికారులు తమ వైఖరి మార్చుకుని క్యాంపస్ హెల్త్ సెంటర్‌లో వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వర్సిటీ ఎస్ఎస్‌యూఐ నాయకులు మహేష్, రాజేందర్, సాగర్‌నాయక్, వంశీ, ప్రసాద్, శివ పాల్గొన్నారు.

సమాచారం..

24 నుంచి టెక్నికల్ కోర్సు పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: ఈ నెల 24 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు జరుగుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ నెల 27 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అలాగే టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్షలు ఈనెల 25 నుంచి 27 వరకు జరుగుతాయన్నారు.

పీఆర్‌టీయూ సమావేశాన్ని జయప్రదం చేయాలి

నిజామాబాద్‌అర్బన్: ఈ నెల 11న జరిగే తెలంగాణ పీఆర్‌టీయూ సమావేశాన్ని విజయవంతం చెయ్యాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కృపాల్ సింగ్ పిలుపునిచ్చారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశానికి 2003 ఉపాధ్యాయులు, సీపీఎస్ ఉపాధ్యాయులు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, 317 జీవో బాధితులు, ఫోరమ్ బాధితులు, పండిత్, పీఈటీ బాధ్యులు ఎయిడెడ్, ఉర్దూ మీడియం ఉపాధ్యాయులు, 398 బాధితులు, పెన్షనర్స్, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు అందరూ హాజరై సమస్యలను విన్నవించాలన్నారు. సంఘం బాధ్యులు నాగేశ్వర్ రావు, బుచ్చన్న, రాము మహిళా ప్రతినిధి శ్రీమతి మనోజ గార్లు పాల్గొన్నారు.

రైతు సదస్సును విజయవంతం చేయండి



మాట్లాడుతున్న పృథ్విరాజ్

నిజామాబాద్ రూరల్: ఈ నెల 13న జరిగే రైతు సదస్సును విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ నాయకులు పృథ్విరాజ్ కోరారు. శుక్రవారం రూరల్ పరిధి మారుతినగర్‌లోని ఆయన నివాసంలో సమావేశం ఏర్పాటు చేశారు. చెరుకు ఉత్పత్తిదారుల సంఘం, ఎఫ్‌పీవో చైర్మన్లు వేల్పూరు భూమయ్య, నాగయ్య, సాయిరెడ్డిలు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతోందన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలు అందించడంలో ప్రభుత్వాలు తమ బాధ్యత నుంచి తప్పించుకుంటున్నాయని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేక, పెట్టిన పెట్టుబడులు రాక వ్యవసాయ రంగం సంక్షోభంలోకి వెళ్తోందన్నారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్లు తుల రాజేందర్, జి.సదానందంలు హాజరరవుతారని తెలిపారు.

పీజీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిలబస్ పూర్తి కాలేదని, విద్యార్థులు చదువుకునేందుకు సమయం సరిపోదని పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు, నాయకులు అమృత్‌చారి, సాయికుమార్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా అవిశ్వాస తీర్మానం



వివరాలు వెల్లడిస్తున్న డీసీవో శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సొసైటీ డైరెక్టర్లు

సిరికొండ: సిరికొండ పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లపై ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం రసవత్తరంగా మారింది. వారిపై తొమ్మిది మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించారు. అవిశ్వాస తీర్మానం ఓటింగ్ కోసం డీసీవో శ్రీనివాస్ శుక్రవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి 11 మంది డైరెక్టర్లు హాజరయ్యారు. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా పది మంది డైరెక్టర్లు చేతులు ఎత్తి మద్దతు తెలిపారు. భోజన విరామం అనంతరం పాత పాలకవర్గం రద్దు విషయం డీసీవో అధికారికంగా ప్రకటించి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవాల్సి ఉంది. అవిశ్వాస తీర్మానంపై చైర్మన్ గంగారెడ్డి, వైస్ చైర్మన్ ప్రకాష్‌లు హైకోర్టును ఆశ్రయించారు. అవిశ్వాస తీర్మానం వివరాలను ఈ నెల 15 వరకు అధికారికంగా ప్రకటించివద్దని హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులు మధ్యాహ్న సమయంలో డీసీవోకు అందాయి. అనంతరం సమావేశంలో డీసీవో మాట్లాడుతూ.. హైకోర్టు ఉత్తర్వుల మేరకు అవిశ్వాస తీర్మానం వివరాలను ఈ నెల 15 తర్వాత ప్రకటిస్తామని తెలిపారు. ఆడిటర్లు రవీందర్, పాపయ్య, ఆనంద్‌రాజ్ పాల్గొన్నారు.

చైర్మన్, వైస్ చైర్మన్లు రాజీనామా చేయాలి

సిరికొండ: కోరం లేకున్నప్పటికి పదవిలో కొనసాగే అర్హత లేదని, వెంటనే సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు తమ పదవులకు రాజీనామా చేయాలని డైరెక్టర్లు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సొసైటీలో వారు శుక్రవారం మాట్లాడారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాకారం రవి, డైరెక్టర్లు, గంగాధర్, నర్సయ్య, సంతోష్, రమేష్, గోవింద్, శ్రీలత, గంగవ్వ, నర్సింహారెడ్డి, చిన్నారెడ్డి, లింగం పాల్గొన్నారు.

పాత కలెక్టరేట్‌ను క్రీడామైదానంగా మార్చాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ పాత కలెక్టరేట్ స్థలాన్ని క్రీడా మైదానంగా మార్చాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతును జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. సుమారు 8 ఎకరాల మైదానంలో నాలుగు లైన్ల వాకింగ్ ట్రాక్, అలాగే సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఇండోర్ క్రీడల కోసం భవనాన్ని నిర్మించాలన్నారు. 20 సంవత్సరాలుగా శిక్షకులు లేక క్రీడాకారుల్లో నైపుణ్యం కొరవడిందన్నారు. పొరుగు ప్రాంతంలో ఆడేందుకు వెళ్లే క్రీడాకారులకు భోజన, రవాణా ఖర్చులను సైతం ఇవ్వడం లేదన్నారు. క్రీడాకారులకు న్యాయం చేయకుంటే 45 క్రీడా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ అంద్యాల లింగన్న, ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కిషన్‌రెడ్డి సంయుక్త కార్యదర్శి సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా తెలుగువీర శతకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెలుగు ఉపాధ్యాయులు

నిజామాబాద్ సిటీ/నిజామాబాద్ రూరల్: నగరంలోని ముబారక్‌నగర్ పాఠశాలల సముదాయం పరిధిలోని తెలుగు ఉపాధ్యాయులంతా కలిసి తీసుకొచ్చిన పద్య సంకలం 'తెలుగువీర శతకం' పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ముబారక్‌నగర్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి రామారావు మాట్లాడుతూ.. 'తెలుగువీర శతకం' వంటి పుస్తకం రాయడం రాష్ట్రంలోనే మొదటిసారి అని అన్నారు. వీరందరినీ ఏకం చేసి ఈ పుస్తకానికి సంపాదకత్వం వహించిన డాక్టర్ కాసర్ల నరేశ్ రావు అభినందనీయులన్నారు. తెలుగుభాషను పరిపుష్టం చేసే పద్యాల రచన చేసిన కాంప్లెక్సు తెలుగు ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మండల నోడల్ అధికారి అమర్‌నాథ్, ప్రముఖకవి అష్టావధాని డాక్టర్ గణపతి అశోక శర్మ, పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు జమీల్, ప్రధాన కార్యదర్శి రమణాచారి, ముబారక్‌నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బస్వయ్య, పుస్తకాన్ని కూర్చిన చింతల శ్రీనివాస్ గుప్త, ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, పర్లి కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత పరీక్షలు

ఇందల్వాయి: తిర్మన్‌పల్లి జీపీ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం శీనునాయక్ డెంటల్ ఆస్పత్రి (నిజామాబాద్) ఆధ్వర్యంలో ఉచిత దంత పరీక్షలు చేశారు. డాక్టర్ శ్రీను నాయక్ విద్యార్థులను పరీక్షించి ఉచితంగా బ్రష్, పేస్టులను పంపిణీ చేశారు. తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	64,300	వెండి (కిలో)	74,400
22 క్యారెట్స్	59,477	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	180
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	35	గాజరుగడ్డ	45	60
బెండకాయ	50	80	పచ్చిమిర్చి	40	70
బీరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	30	50	ఆలుగడ్డ	16	30
బీర్నీసుకాయ	30	60	గోబిగడ్డ	20	40
కాకరకాయ	60	80	గోబిపువ్వు	20	40
వంకాయ	10	20	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	15	30	గోరుచిక్కుడు	50	60
పుదీనా	25	50	చిక్కుడుకాయ	50	60
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఈగల్ (తెలుగు) - 10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	యాత్ర-2 (తెలుగు) - 1.30, 10.35 అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్ (తెలుగు) 4.35, లాల్ సలామ్ (తెలుగు) 7.35
స్క్రీన్-3	హనుమాన్ (తెలుగు) - 7.25 లాల్ సలామ్ (తెలుగు) - 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-2	తేరి బాతోమే (హిందీ) - 12.30 హనుమాన్ (హిందీ) - 3.40, ఈగల్ (తెలుగు) - 7.00, 10.20
స్క్రీన్-3	యాత్ర-2 (తెలుగు) - 10.25, 4.20, 7.15, 10.10
స్క్రీన్ -4	కెమెరామెన్ (తెలుగు) - 12.25 తేరి బాతోమే (హిందీ) - 3.40, 6.50, 10.00
దేవి	హనుమాన్ (తెలుగు)
నటరాజ్	కిస్మత్ (తెలుగు)
లలితామహల్	ఈగల్ (తెలుగు)
విజయ్	లాల్ సలామ్ (తెలుగు)- 11.15, 6.15 యాత్ర-2 (తెలుగు) - 2.15, 9.15